## ఆధునిక మరాఠీ దళిత కథ

# 'విస్ఫోటనం'

మరాఠీ మూలం: యోగీరాజ్ వాగ్మరే

ఇంగ్లీషు: లలితాపరంజపే

తెలుగు: త్రిపురనేని శ్రీనివాస్

సాయంత్రం. షేకు తలెత్తి దూరంగా చూశాడు. కొన్ని అడుగులు ముందుకేసి మళ్లీ వెనక్కొచ్చి చింతచెట్టు కింద కూర్చున్నాడు. అతను మధ్యాహ్నం నుంచి రోడ్డు వంక అదే పనిగా చూస్తున్నాడు. అతని మనసు అల్లకల్లోలంగా వుంది. నెత్తిమీద కట్టెల మోపులతో ఎవరో కట్టెలు కొట్టుకునే వాళ్లు వస్తుంటే షేకు ఎదురెళ్లి 'దార్లో మీకెవరైనా కుర్రాడు కనిపించాడా?' అని అడిగాడు. వాళ్లలో ఒకరు 'కొంతమంది గొడ్డకాడ బుడ్డోళ్లు దొంగాట ఆడుకుంటూ కనిపించారు. నువ్వు అడుగుతున్న కుర్రాడు వాళ్లలో వున్నాడేమో తెలీదు' అని జవాబిచ్చాడు.

'కాదు, కాదు వాడు గొడ్డకాడ బుడ్డోడు కాదు. వాడు తెల్లచొక్కా, ప్యాంటూ వేసుకుని దొరబాబులా వుంటాడు' అని షేకు చెప్పేలోగానే కట్టెలు కొట్టుకునే వాళ్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

షేకుకి ఆదుర్దాగా వుంది. తానే స్వయంగా వూరి బయటిదాకా వెళ్లి చూసొద్దామని చెప్పులేసుకుని బయల్దేరాడు.

'చీకటి పడకముందే వచ్చెయ్యమని చెప్పాను. అయినా వాడి జాడలేదు. బహుశా అక్కడే వుండిపోయాడేమో' గొణుక్కున్నాడు షేకు. కొద్ది దూరం వెళ్లాక తన పశువుల మందతో ఇంటికి తిరిగొస్తున్న నమాబంగార్ ఎదురయ్యాడు. షేకుని చూసి 'ఏమిటి ముసలాయినా ఈ వేళప్పుడు ఎటెళ్తున్నావ్?' అని అడిగాడు. 'నా కొడుకు కోసమండీ. వాడింకా ఇంటికి తిరిగి రాలేదు. వూరి బయటిదాకా వెళ్లి ఒకసారి చూసొద్దామని.'

నమాబంగార్ తన పొవ్వాకు తిత్తి బయటకు తీశాడు. ఇద్దరూ చెరికొంత పొగాకు నోట్లో వేసుకున్నారు. నమా రెండు, మూడుసార్లు పొవ్వాకు వుమ్మిని థువూ, థువూమని వూసి తన దారిన తాను పోయాడు. అప్పటికే అతని పశువుల మంద ఫర్లాంగు దూరం దాటిపోయింది.

షేకు నిర్జనంగా వున్న రోడ్డు వంక కళ్లు చికిలించి చూశాడు. ఎవరూ అతని చూపుకి ఆనలేదు. సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఇక లాభం లేదని షేకు తిరుగుముఖం పట్టాడు. గుడిశెలోకొచ్చి దీపం వెలిగించాడు. ఆడవాళ్లు వంట పనిలో మునిగున్నారు. బయట చీకటి ముసురుకొంటోంది. అప్పుడా ముసలాయనకు ఇంటికొస్తున్న కొడుకు కనిపించాడు.

'అరే షేతిబా ఇంత ఆలస్యమైందేరా?'

'లేటుగా బయల్దేరాను' అని చెప్పి షేతిబా భుజానికున్న సంచిని చిలక్కొయ్యకు తగిలించాడు.

'అక్కడ ఎవరన్నా తోడు దొరికారా?'

'ఆ... మా స్నేహితుడు ఆత్మారామ్ షెల్కే అక్కడే వుంటాడు. వాళ్లది వాడ్గాన్. వాళ్లింటికి కూడా తీసుకెళ్లాడు. అందుకే ఆలస్యమైంది.'

'సర్లే కాళ్లూ, చేతులూ కడుక్కో. అన్నం తిందువుగానీ.'

షేతిబా అన్నానికి కూర్చున్నాడు. అప్పటికే వాళ్లమ్మ రొట్టెలు కాల్చింది. గుడిశెలోని పిల్లలందరూ ఆమె చుట్టూచేరి ఆత్రంగా చూస్తున్నారు. ఆమె షేతిబాకు రొట్టెలు పెట్టగానే పిల్లలందరూ అతని పళ్లెం చుట్టూ కూర్చుని తినడం మొదలెట్టారు. ఎవరూ మాట్లాడటం లేదు. అప్పుడప్పుడూ పిల్లల అరుపులే నిశ్శబ్దాన్ని భంగపరుస్తున్నాయి. షేకు ఈ నిశ్శబ్దాన్ని భరించలేకపోతున్నాడు. ధోకీకి వెళ్ళాడు కదా, అక్కడ ఫ్యాక్టరీలో ఏమైంది? షేతిబాకు ఉద్యోగం దొరికిందా? అతని మనసులో అనేక ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు ఒక్క షేతిబానే సమాధానం చెప్పగలడు. కానీ షేతిబా మాట్లాడటం లేదు. ఏం జరిగిందో షేకు వూహించుకోలేకపోతున్నాడు. షేతిబా మాట్లాడితే బావుండును అనుకుంటున్నాడు. అతనొక్కడే కాదు అతని భార్య, మూల చీకట్లో కూర్చున్న షేతిబా భార్య పామి అందరూ షేతిబా ఏం చెబ్తాడా అని ఎదురుచూస్తున్నారు. పామి తన భర్తవంక చూసింది. అతను తల వంచుకుని పళ్లెంలోకి చూస్తూ పిల్లలు వదిలేసిన రొట్టె ముక్కల్ని ఏరుకుని తింటున్నాడు. ధోకీకి వెళ్లొచ్చిన పని ఏమయిందో చెప్పకుండా తన భర్త తాత్సారం చేస్తున్నందుకు ఆమెకు కొంచెం కష్టంగా వుంది.

షేతిబా ఇంకా మౌనాన్నే పాటిస్తున్నాడు. ఇక చూసి చూసి ఆగలేక షేకూనే 'పనయ్యిందా?' అని అడిగాడు.


గుడిశెలోని చీకటి మరింత దట్టమయింది. బుడ్డి దీపం వెలుగు ఒకసారి అటూ ఇటూ వూగిసలాడి షేకు జవాబు విందామని నిశ్చలంగా నిలబడింది. పిల్లలు కూడా నోళ్లు కట్టేసుకుని ఆసక్తిగా చూస్తున్నారు. పామి, షేతిబా అమ్మ చెవులు రిక్కించారు.

'లేదు' షేతిబా లోగొంతుకతో చెప్పి నోటి దగ్గరకు తీసుకున్న రొట్టె ముక్కను పళ్లెంలో పడేసి కాసిన్ని నీళ్లు గొంతులో పోసుకున్నాడు.

'లేదు' అన్నమాట ఆ నిశ్శబ్దంలో హోరెత్తింది. వాళ్లమ్మ శిలాప్రతిమలా చూస్తుండిపోయింది. పామి పమిట చెంగుతో కన్నీళ్లు తుడుచుకుంది. షేకు తేరుకుని 'సాహెబ్ ఏమన్నాడు?' అని అడిగాడు. 'ఖాళీలు లేవు. వచ్చే నెల ఒకటో, రెండో ఖాళీలొస్తాయి' షేతిబా తల వంచుకునే జవాబిచ్చాడు.

'సాహెబ్' అన్నమాట వినగానే పొద్దున్న ఫ్యాక్టరీలో జరిగిన విషయాలు షేతిబా కళ్లముందు కదలాడాయి. విశాలమైన ఆవరణలో ఫ్యాక్టరీ, అందులో ఆగకుండా పని చేస్తున్న పెద్ద పెద్ద యంత్రాలు, వందలాది చెరుకు మోపులు, చెరుకు కొడుతున్న కూలీలు, మోసుకెడుతున్న కూలీలు, లారీలు, ఎడ్లబండ్లు, హడావుడి, గందరగోళం అన్నీ గుర్తొచ్చాయి.

సాహెబ్ తనకు ఉద్యోగం ఇచ్చివుంటే తాను కూడా వళ్లు దాచుకోకుండా పనిచేసేవాడు. ఇంటి సమస్యలన్నీ తీరిపోయి వుండేవి అనుకున్నాడు. కానీ అలా జరగలేదు. అక్కణ్ణుంచి అతను ఫ్యాక్టరీలో మరోవైపుకొచ్చాడు. అక్కడో లారీ ఆగి వుంది. కొంతమంది కూలీలు మొలాసిస్‌ను



లారీలోకి ఎక్కిస్తున్నారు. వాళ్ల శరీరాలు మడ్డి పేరుకుపోయి చూడ్డానికి అసహ్యంగా వున్నాయి. పైగా గబ్బు కొడుతున్నారు. షేతిబాకు వాంతి వచ్చినంత పనయింది. వాళ్లను చూడలేకపోయాడు. ముక్కుకి కర్చీఫు అడ్డం పెట్టుకుని అక్కడి నుంచి వచ్చేశాడు. వస్తుంటే గేటు దగ్గర 'మొలాసిస్ మోయటానికి కూలీలు కావాలి' అనే బోర్డు కనిపించింది. ఆ బోర్డుని చూసి షేతిబాకు ఎందుకొచ్చిందోగాని నవ్వొచ్చింది. ఇంతలో అతని ఆలోచనా స్రవంతి తెగింది.'

'లేదు' అన్న షేతిబా మాటతో అందరూ దిగాలు పడ్డారు. అతను మెట్రిక్యులేషన్ పాసయ్యి ఇప్పటికి మూడేళ్లయింది. ఇంతవరకూ ఉద్యోగం రాలేదు. క్లర్కు, కాకపోతే టీచర్, కాకపోతే కనీసం ప్యూను ఉద్యోగం కూడా రాలేదు. షేతిబా అన్ని ప్రయత్నాలూ చేశాడు. కొన్ని డజన్ల ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టాడు. ఒక్క అవకాశాన్నీ వదల్లేదు. అయినా ఉద్యోగం రాలేదు. ఇంటికెప్పుడూ వట్టి చేతులతోనే వచ్చేవాడు. అయినా నీరసపడేవాడు కాదు. మరుసటి రోజు కోసం తనకు తాను ధైర్యం చెప్పుకునేవాడు. పొద్దునే ధోకీ వెళ్లాడు. ఫ్యాక్టరీలో వాచ్‌మన్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ జరిగింది. కానీ షేతిబాకు ఉద్యోగం రాలేదు.

షేతిబాకు ఉద్యోగం వస్తే పరిస్థితులు చక్కబడతాయని, తింటానికి తిండి, కట్టుకోటానికి గుడ్డ దొరుకుతాయని షేకు వూహ. అవే అతని కలలు. మొదట్లో షేతిబాకు ఉద్యోగం దొరకలేదన్నప్పుడు షేకు పెద్ద పట్టించుకోలేదు. ఈ రోజు కాకపోతే రేపు వస్తుందిలే అనుకునేవాడు. కానీ ఎన్ని రోజులు గడిచినా, ఎక్కడికి వెళ్లినా 'లేదు' అనే సమాధానం రావడంతో షేకు నమ్మకం తల్లకిందులయింది. అతని కల చెదిరిపోయింది. కాళ్లకింద నేల తొలుచుకుపోతున్నట్టు భయపడుతున్నాడు. ఇప్పుడతను ముక్కలైన మనిషి.

'మరిప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావు?' షేకు వుండబట్టలేక అడిగాడు.

'కొద్ది రోజులు ఆగుదాం. ఏదో ఒకటి కలిసొస్తుంది' అన్నాడు షేతిబా.

'ఎంతకాలమని ఆగుదాం? ఇలా ఆగుతూపోతే చివరకు మనందరం చావటం తప్ప మరోటి జరగదు. లాభం లేదు. రేపే నేను నీకేదైనా పని చూపిస్తాను. నువ్వు చెప్పే ఉద్యోగం మనకు అక్కర్లేదు' ముసలాయన ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా అన్నాడు.

షేతిబాకు ఏం తోచలేదు. ఏదో చెబుదామనుకున్నాడు. కానీ ఒక్క మాట పెదవి దాటలేదు. షేకు లేచి గుడిశె బయట చాప పరుచుకున్నాడు. పామిరోలు పక్క ముడుచుకు పడుకుంది. వాళ్లమ్మ, అక్కలు, చెల్లెళ్లు, తమ్ముళ్లు చాలీచాలని దుప్పటి కింద సర్దుకున్నారు. బీదరికం షేతిబాను వుడకాడిస్తోంది. అతను చాలా సేపటివరకు అలా గోడకానుకుని వుండిపోయాడు. మనసులో ఆలోచనల ముసురు. బయట నిశ్శబ్దం భరించరానిదిగా వుంది. కాసేపటికి లేచి తండ్రి పక్కన పడుకుని నిద్రపోయాడు. రాత్రి భుక్తాయాసంతో పాకుతున్న కొండచిలువలా కదులుతోంది.

మరుసటి రోజు షేకు తన మహర్ జాతికి చెందిన పెద్దలనందరినీ పిలిపించాడు. భివాగేక్వాడ్, గంగుర్డె సత్వా, గానా, దిగాకాంబ్లే, నివృత్తి, సిదా అందరూ వచ్చారు. షేతిబా ఒక పక్కగా కూర్చుని వేపపుల్లతో పళ్లు తోముకుంటున్నాడు. వచ్చిన పెద్దలతో షేకు కాసేపు అవీ ఇవీ ముచ్చటించాడు. ఇంతలో దిగా కాంబ్లే 'వచ్చి చాలాసేపయింది. ఏంటి విషయం? షేతిబా నీకు ఉద్యోగం ఏదైనా వచ్చిందా?' సూటిగా అడిగాడు.

'ఉద్యోగం' అన్నమాట వినగానే షేతిబా గుండె బరువెక్కింది. అయినా అదేం బయటకు కనిపించనీకుండా 'లేదు. ఇంకా రాలేదు. అయ్య కదా మిమ్మల్ని పిలిచింది, ఆయన్ను అడగండి' అన్నాడు.

'బావుంది, బావుంది. చూస్తూవుంటే అబ్బా

కొడుకుకు 'ఏం పడుతున్నట్టు లేదు' అన్నాడు సిదా కాస్త వ్యంగ్యంగా. ఆ మాటకు 'అదేం కాదు మావయ్యా' అంటూ షేతిబా బరబరా పళ్లు తోముకోసాగాడు.

'మరైతే విషయం ఏమిటి?' సిదా అడిగాడు.

'చూడండి. దీని గురించి షేతిబాకు ఏమీ తెలీదు. నేనే మిమ్మల్ని పిలిచాను. ఎందుకంటే.. 'షేకు వివరించటం మొదలెట్టాడు.

'ఈ వూళ్లో మన పాకీవాళ్ల కుటుంబాలు నలభై వుండేవి. వాటిలో ఇరవై కుటుంబాలు పట్టణాలకు వెళ్ళి పొట్ట పోసుకుంటున్నాయి. పరిస్థితులు అంత బాగాలేవు..' షేకు చెబుతుంటే మిగిలిన వాళ్లందరూ అవునవునని తలలూపారు. షేకు అసలు విషయానికి రావటం లేదన్న అసహనంతో గానాజోక్యం చేసుకుని 'అది సరే. నువ్వు చెప్పింది నిజమే. కానీ ఈ డొంక తిరుగుడు వ్యవహారమేమిటి? అసలు మమ్మల్నెందుకు పిలిపించావు?' అన్నాడు.

'చెబ్తాను వినండి. మన పాకీవాళ్లలో ఎవరూ తమ పిల్లల్ని బడికి పంపనప్పుడు నేను షేతిబాను బడికి పంపాను.' ఈ మాటకు అక్కడ చేరిన పెద్దలు తమలో తాము ఏదో గొణుక్కున్నారు.

'షేతిబా మెట్రిక్యులేషన్ పూర్తిచేసి ఇప్పటికి మూడేళ్లయింది. అయినా వాడికి పని దొరకలేదు. ఉద్యోగం కోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నాడు గానీ రావటం లేదు.'

తన భారమైన హృదయాన్నీ, అందులో సుళ్లు తిరుగుతున్న భావాలనీ షేకు ప్రపంచం ముందు పెడుతున్నాడు. తన విషయం సర్పంచాయితీ ముందు ఎందుకు పెడుతున్నాడో షేతిబాకు అర్థం కావడం లేదు. ముభావంగా కూర్చుని తండ్రి చెప్పేది వింటున్నాడు.

'ఇప్పుడు మా పరిస్థితి ఏం బాగోలేదు. ఒక్కోసారి రెండు రోజుల తరబడి పస్తులుంటున్నాం. షేతిబాకు ఉద్యోగం వస్తుందన్న ఆశ లేదు. అందుకని విధిలేని పరిస్థితుల్లో మిమ్మల్ని వేడుకొంటున్నాను. నా పాకీ పని మళ్లీ నాకు అప్పగించండి. కాదనకండి. షేతిబా మాటలు విని మన పని మానెయ్యటం తప్పని తెలుసుకున్నాను. వాడిచేత కూడా మన పని చేయిస్తాను.' తాను చెప్పదల్చుకుంది చెప్పి షేకు వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టాడు. ఏడుస్తూనే తమకు సాయం చెయ్యమని పెద్దల ముందు చేతులు సాచాడు.

షేకు మాటలు షేతిబా నెత్తిన పిడుగుల్లా పడ్డాయి. ఈ హఠాత్ పరిణామానికి సెనుతు ఫాసులో అరటి చెట్టులా కూలిపోయాడు. వేలటన్నుల బరువు కింద నలిగి నజ్జవుతున్నట్టు అనిపించింది అతనికి. తండ్రి మాటలు ఒక్కోటి ఒక్కో శూలంలా అతని ఆత్మలో గుచ్చుకున్నాయి.

ఆధునిక మరాఠీ దళిత కవిత

## నేనే భాష మాట్లాడాలి?

చవిటి పర్రలో నిలబడి పాయా నవుల్తూ
మా తాతయ్య,
నా శరీరంలో శాశ్వత నివాసి
సంప్రదాయభారంతో నడుము జారిన వాడు
ఒక్క రంకె వేశాడు
'ఒరేయ్ లం[redacted]
మేం మాట్లాడినట్టు మాట్లాడు
నీకే చెబ్తున్నాను
నాలాగే మాట్లాడు'

నేతి పిలకతో,
వేదపఠనం చేస్తూ
మా బ్రాహ్మణయ్యోరు గదమాయించాడు
'వెధవా భాషను సరిగ్గా ఉపయోగించు'

ఇప్పుడు నేను అడుగుతున్నాను
నేనే భాష మాట్లాడాలి?

మరాఠీ మూలం: అరుణ్ కాంబ్లే
ఆంగ్లానువాదం: ప్రియ అదర్కార్
తెలుగుసేత: త్రిపురనేని శ్రీనివాస్

'నా పిల్లలందరూ చిక్కి శల్యమైపోతున్నారు. వాళ్లకు నేనేం చేయలేక పోతున్నాను. ఇకపై అలా జరగటానికి వీల్లేదు. ఒడ్డున పడిన చేపల్లా వాళ్లు వాడి మసైపోవటాన్ని నేను చూడలేను. వాడు పాకీ పని చేస్తే పిల్లలకు నాలుగు రొట్టెముక్కలైనా దొరుకుతాయి.' షేకు కంటికి మంటికి ఏడుస్తున్నాడు.

తండ్రి తీసుకున్న నిర్ణయంతో షేతిబా నోటమాట రావటం లేదు. చిగురుటాకులా వణికిపోతున్నాడు. ఏం చెప్పాలో తోచటం లేదు. అతని కళ్లలో ద్వేషం సుళ్లు తిరుగుతోంది. అతని కనుపాపల్లో నిరసన జ్వాలలు ఎగసి పడుతున్నాయి. 'చివరికెలాగో నోరు పెగల్చుకుని 'అయితే నేనీ ఇంట్లో వుండను' అన్నాడు.

'ఎక్కడికెళతావు? అమ్మనీ, పిల్లల్నీ వదిలి ఎక్కడికెళతావు?' బాధ గొంతుకడ్డం పడుతుంటే అనలేక అన్నాడు షేకు.

'నీ నుంచీ దూరంగా' షేతిబా మనసులో అనుకున్నాడు. బయటకు అందామనుకున్నాడు గానీ అనలేకపోయాడు. దెబ్బతిన్న జింక అయినప్పటికీ పైకి లేవటానికి తీవ్రంగా ప్రయత్నించాడుగానీ తగిలిన గాయం లోతైనది కావటంతో మళ్లీ ఒరిగిపోయాడు.

నిప్పులు కక్కిన అతని కళ్లు కాంతిహీనమయ్యాయి. నాలుక పక్షవాతం వచ్చినట్టు పడిపోయింది. చుట్టూ చూశాడు. పొయ్యి దగ్గర చిరిగిన బట్టల్తో అమ్మ, అర్ధనగ్నంగా అక్కలు, చెల్లెళ్లు, తమ్ముళ్లు, వయోభారంతో కుంగిపోతున్న తండ్రి– అందరూ బతికున్న శవాల్లా కనిపించారు. హఠాత్తుగా అతన్ని శవాలు ముట్టడించాయి. తన తమ్ముడు పంఢ్రులాను డాక్టర్ చేద్దామనుకున్నాడు. విఠల్ లాయర్గానీ, జిల్లా కలెక్టర్గానీ అవుతాడనుకున్నాడు. సుమా స్కూల్ టీచర్ అయితే బావుండుననుకున్నాడు. తన భార్య పామీకి నైలాన్ చీర కొందామనుకున్నాడు.

షేతిబా ఆ రోజు పచ్చి మంచినీళ్లు ముట్టలేదు. తండ్రితో ఒక్క మాట మాట్లాడలేదు. ఒక రాత్రప్పుడు అతని ఒళ్లు కాలిపోతోంది. జ్వరం. భయం నుంచి జ్వరం. బాధ నుంచి జ్వరం. షేకు మేలుకునే వున్నాడు. ఆయన లేచి షేతిబా ఒంటిమీద దుప్పటి సరిచేశాడు. వెచ్చగా కాలిపోతున్న అతని నుదుటి మీద చేయి ఆన్చి ఓదార్చబోయాడు. అయితే ఆ వేడికి ఆయన శరీరం వణికింది. కళ్లమ్మట రెండు కన్నీటి చుక్కలు రాలాయి. మనసులో దిగులు భూతం ఆవరించింది.

'నేను అర్థం చేసుకోగలనురా. నీ బాధను నేను అర్థం చేసుకోగలను. నీకిది నచ్చదని నాకు తెలుసు.' షేకు తనని తాను సంబాళించుకోలేక వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టాడు. గుడిశెలో నిశ్శబ్దం. బుడ్డి దీపంలో కాలిపోయిన చమురు తాలూకు ఖాళీతనం. షేతిబా సగం నిద్రలోంచి గొణుగుతున్నట్టు 'అయ్యా నన్నలా చేయకు. నన్ను పాకీ పని చేయమని అడగకు' అని పూడుకుపోతున్న గొంతుతో అర్థించాడు. షేకు అది విని భరించలేక పోయాడు. సగం తెరిచిన షేతిబా పెదవులపై చేతులాన్చాడు. యుద్ధంలో ఓడిపోయి లొంగిపోతున్న వ్యక్తిలా షేతిబా ఆ మాటలన్నాడు. అప్పటికే దారిద్ర్యంతో పోరాడి అలసిపోయిన అతని తండ్రి మౌనంగా రోదిస్తున్నాడు. కాసేపటికి ఇద్దరూ నిస్సత్తువుగా నిద్రలోకి జారుకున్నారు.

తెల్లారింది. షేకు ఇంట్లో స్మశాన వాతావరణం ఆవరించింది. షేతిబా తెల్లారగట్టే ఇల్లొదిలి వెళ్లిపోయాడు. 'నేను దొరికిన ఏ పనైనా చేస్తాను. చివరకు మొలాసిస్ కూడా మోస్తాను' అని వెళ్లేప్పుడు వాళ్లమ్మకు చెప్పాడు. షేకు గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ భార్యను అడిగాడు 'దార్లో తింటానికి వాడికి రొట్టె ముక్కయినా ఇచ్చావా?'